క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సత్యనారాయణ బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సుభాష్‌చంద్రబోస్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడగా సూపర్‌టెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణకు ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు, ఈజీఎస్ సిబ్బంది శుభాకంక్షాలు తెలిపారు.

కమిటీ ఎన్నిక


అధ్యక్షుడిని సన్మానిస్తున్న జర్నలిస్టులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.కె నజీరుద్దీన్, ఉపాధ్యక్షుడిగా మీర్జా మోబిన్ బేగ్, ప్రధాన కార్యదర్శిగా తూటిచర్ల దుర్గయ్య, కోశాధికారిగా ఐత రాజిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా చీర్లవంచ రమేష్‌చారి, బాధ్యులుగా రేగుల భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిక ఎన్నికైన నజీరుద్దీన్‌ను సభ్యులు సన్మానించారు. సీనియర్ సభ్యులు శఫీ, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలిమెల: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాత్రి పది గంటలకు విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. గాలిదుమారంతో పాటు భారీ వర్షానికి మండలంలోని పంకెన, వలెంకలగడ్డ గ్రామాల మధ్య చెట్లు విరిగి తీగలపై పడ్డాయి. దీంతో ఆ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీగలపై పడిన చెట్లను తొలగించి విద్యుత్ సరాఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పిల్చుకున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

ములుగు రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్ అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్ట్‌లను అమ్ముతూ నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్, రాజ్‌కుమార్, వేణు, నవీన్, రమేష్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మంగపేట: జూలై 07న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజలతో కలిసి ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ నాయకుడు చాతాళ్ల రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకుల అత్యవసర సమావేశం గుగ్గిళ్ల సురేష్ మాదిగ, ఎంపెల్లి శంకర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా చాతాళ్ల రమేష్ మాదిగ, తడుగుల విజయ్ మాదిగ హాజరై ఎస్సీ వర్గీకరణ ఉద్యమ చరిత్రను వివరించారు. పద్మశ్రీ మందకృష్ణ మదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు సాధించి పెట్టిన సంక్షేమ పథకాలను సమాజానికి చేసిన సేవలను వివరించారు. సమావేశంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యామ్ మాదిగ, మండల సీనియర్ నాయకులు ఎల్‌పి శ్రీను, సారయ్య, ముత్యాలు, చిన్న శ్రీను పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టీవీ దగ్ధం

వాజేడు : మండలంలోని చీకుపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టీవీ దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. చీకుపల్లి చెందిన గొంది సంజీవరావు ఇంట్లో టీవీ ఆన్ చేసి ఉంచారు. గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగు తుండటంతో కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. ఆన్‌లో ఉన్న టీవీ ఒక్కసారిగా పేలిన శబ్దం వచ్చి దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి వెళ్లి పరిశీలించారు.

మహిళలకు వరం ‘స్త్రీనిధి’

- ఉపాధితో పాటు ఆర్థిక బలోపేతం..
- సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు


మండల సమాఖ్య సమావేశం నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

మొగుళ్లపల్లి: మహిళ సంఘాలను బలోపేతం చేయడానికి స్త్రీనిధి పథకం ఎంతో దోహదపడుతోంది. ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు ఉపాధి కల్పిస్తోంది. ప్రైవేట్ చిట్‌ఫండ్స్ దగ్గర అప్పులు తీసుకొని వేధింపులకు గురికాకుండా సొంతంగా పొదుపు చేసుకునే అవకాశం కల్పిస్తోంది. సభ్యుల అవసరాలను తీర్చుకోవడం, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన చేసేందుకు ప్రభుత్వం నామమాత్రపు వడ్డీతో రుణ సౌకర్యం కల్పిస్తూ 2011లో స్త్రీనిధి పథకాన్ని ప్రవేశపెట్టింది.

పొదుపు ప్రధాన అంశం..

స్త్రీనిధి ద్వారా రుణం పొందాలంటే దరఖాస్తు చేసే ముందు సమృద్ధి పొదుపు పథకంలో ప్రతీ నెలకు రూ.100 చొప్పున పొదుపు చేయాలి. ఏడాదికి రూ.1200 ఒకేసారి డిపాజిట్ కూడా చేయవచ్చు. ఇలా ఆరు సంవత్సరాలు కలిపి రూ.7200 ఒకేసారి చెల్లించవచ్చు. ఈ నగదు సభ్యుల బ్యాంకు ఖాతాల ద్వారా స్త్రీనిధికి అనుసంధానం చేస్తారు. వీటిపై ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తోంది. గరిష్ఠంగా ఆర్‌బీఐ 12 నెలల పొదుపుపై ఇచ్చే వడ్డీని జమ చేస్తోంది. ఆ సంఘాల వివరాలను స్త్రీనిధి వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. సంవత్సరకాలం సంఘాలు జమ చేసిన పొదుపును ఐదేళ్ల కాలపరిమితితో సంఘాల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మారుస్తారు. అనంతరం ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీని సంఘాలకు అందజేస్తారు. స్వయం సంఘాల్లో చేరిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తారు. వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మండలంలోని మహిళలు స్త్రీనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మండలంలో 34 వీఓలు, 805 సంఘాలున్నాయి. ఆ సంఘాల్లో ఇప్పటి వరకు 8690 మంది సభ్యులు ఉన్నారు. అందులో 70 సంఘాలకు గాను 205 మంది మహిళలకు ఇప్పటి వరకు రూ.2.03 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీనిధి పథకం పేదలకు చేయూతనందిస్తోంది. ఈ పథకాన్ని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. మండలంలో ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేశాం. స్త్రీనిధి రుణం పొందిన మహిళలు సకాలంలో రుణాలు చెల్లించి సహకరించాలి.

- రవివర్మ, ఏపీఎం, మొగుళ్లపల్లి

అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

టేకుమట్ల: అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి పలు చోట్ల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అనంతరం వెంకట్రావ్‌పల్లి (బి)గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గర్మిళ్లపల్లి, వెలిశాల గ్రామాల్లో పల్లె దవాఖానలను ప్రారంభించారు. సుబ్బక్కపల్లి, పంగిడిపల్లిలో అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని పంగిడిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో జిల్లా సంక్షేమ అధికారిని మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్ బిర్యాని కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. అంతకుముందు సుబ్బక్కపల్లి గ్రామంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కత్తి సంపత్‌గౌడ్, సంగి రవి, పెరుమాండ్ల మొగిళి, నామని రాజేందర్, చిరంజీవి, పంగ నరేష్, నాంపెల్లి వీరేశం, రాజేందర్, శాస్త్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


చిట్యాల: మాట్లాడుతున్న ఎంఈఓ రఘుపతి


మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఎంఈఓ

- ఎంఈఓ కోడెపాక రఘువతి

చిట్యాల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని మండల విద్యాశాఖధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సానిటేషన్, మధ్యాహ్న భోజన కార్మికులకు ఒకరోజు శిక్షణతో పాటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదల వంట కార్మికులపై ఉందని తెలిపారు. అందుకోసం సిబ్బంది తగు జాగ్రతలు పాటించాలని కోరారు. మోను ప్రకారం వంటలు చేసి నాణ్యమైన భోజనం పెట్టాలని కోరారు. పాఠశాలలో శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజు తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు కిరణ్‌కుమార్, సరళదేవి, ఎమ్మార్సీ ఆకుల హరీశ్, సీఆర్పీ రాజు నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పాఠశాల పరిశుభ్రతలో స్కావెంజర్ పాత్ర కీలకమైందని మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి అన్నారు. బుధవారం మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణపై మండల స్థాయి శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతిరోజు స్కావెంజర్లు పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచి ఆరోగ్యవంతమైన పాఠశాల నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు బోగి రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాజయ్య, ఎమ్మార్సీ సిబ్బంది వేణు, వసంత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మందులు అందించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: వివిధ అనారోగ్య సమస్యలతో సింగరేణి ఏరియా ఆస్పత్రికి వచ్చే రిటైర్డ్‌మెంట్ కార్మికులకు సరిపడ మందులు అందించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఏరియా ఆస్పత్రి ఏసీఎంఓ డాక్టర్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. వందల కిలోమీటర్ల నుంచి రిటైర్డ్‌మెంట్ కార్మికులు ఏరియా ఆస్పత్రికి వస్తున్నారని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెల రోజులకు సరిపడు షుగర్, బీపీ, థైయిరాడ్, మందులు అందజేయాలని ఏఐటీయూసీ నాయకులు వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మాతంగి రామచందర్, విజేందర్, శ్రీనివాస్, తాళ్ల పోశం, నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం గ్రామంలో తెల్లవారు జా మున పాడిగేదెకు ఢీ కొని ఒకరు గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మంగపేట మండలం గంపోనిగూడెం గ్రామానికి చెందిన బద్ది పాపారావు ఏటూరునాగారం వచ్చి స్వ గ్రామానికి వెళ్తుండగా గేదెను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఏ టూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని స్థానిక వైద్యులు తెలిపారు.

సూచిక బోర్డులేక.. డ్రైవర్లు తికమక!

- మెట్లమీదకు దూసుకువస్తున్న వాహనాలు


మెట్లమీదకు దూసుకువచ్చిన డీసీఎం వ్యాన్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఫిబ్రవరి నెలలో కుంభాభిషేకం సమయంలో తూర్పు వైపు ప్రధాన రహదారి నుంచి మెట్ల మార్గం నిర్మాణం చేశారు. కానీ నిత్యం తూర్పు రాజగోపురం నుంచి వాహనాలు ప్రధానరహదారి వైపునకు తరలిరావాడంతో మెట్లపై దూసుకువస్తున్నాయి. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు లేక డ్రైవర్లు, వాహనదారులు తికమకపడుతున్నారు. కార్లు, వ్యాన్లు, మీని బస్సులు మెట్లమార్గంపై వస్తు ఎదురుగా ఉండే దుకాణాల్లోకి దూసుకు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. బుధవారం ఉదయం ఓ డీసీఎం వ్యాన్ రోడ్డుమార్గం ఉందని భావించి రావడంతో మెట్లపైకి ఎక్కించాడు. కాగా, ఎలాంటి ప్రమాదం జరుగులేదు. ప్రమాదం జరుగకముందే దేవస్థానం అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- మండల వ్యవసాయ అధికారి మహేష్

కన్నాయిగూడెం: మండలంలోని విత్తన షాపుల్లో నాణ్యమైన విత్తనాల విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ముప్పనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లోని ఫర్టిలైజర్స్, సీడ్, పెస్టిసైడ్స్ షాపుల్లో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న వరి, మిర్చి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. వాటికి సంబంధించిన పత్రాలు, షాపుల లైసెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టాక్‌కు సంబంధించిన రికార్డులు, క్రయవిక్రయాల రిజిస్టర్లను తప్పకుండా మెయింటనెన్స్ చేయాలన్నారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ రెన్యూవల్ ఉండాలన్నారు. ధరల పట్టికను షాపు ఎదుట ఉంచాలని షాపు యజమానులకు సూచించారు. అనంతరం రైతువేదికలో రైతులకు ఏర్పాటు చేసిన విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు కొన్న విత్తనాలకు బిల్లు రసీదు తప్పనిసరిగా పొందాలన్నారు.

‘భూ భారతి’తో భూ సమస్యల పరిష్కారం


రేగొండ(కొత్తపల్లిగోరి): అధికారులకు సమస్యలు తెలుపుతున్న రైతులు

- తహసీల్దార్ లక్ష్మీరాజయ్య


కాటారం: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్

రేగొండ(కొత్తపల్లిగోరి): భూ భారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తాయని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అన్నారు. బుధవారం కొత్తపల్లిగోరి మండలంలోని కొనరావుపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 180 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పకిడే రాజయ్య, శ్వేత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొనరావుపేటలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొనరావుపేట శివారులో గల సర్వే నంబర్ 33లో కొంత మంది దళారులు బై నంబర్లు సృష్టించి వందల ఎకరాలు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని తహసీల్దార్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. ఆ పట్టా బుక్కులతో రైతుబంధు, క్రాప్‌లోన్లు కూడా పొందారన్నారు. పాస్ పుస్తకాలను రద్దు చేసి గత 50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందజేయాలని కోరారు.

కాటారం: మండలంలోని కంబలపాడ్, గుండ్రాత్‌పల్లిలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పలు భూ సమస్యలపై రైతులు, భూ యజమానుల నుంచి రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కంబలపాడ్‌లో 87, గుండ్రాత్‌పల్లిలో 85 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం


భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు


పలిమెల: ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

- తహసీల్దార్ శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నందిగామలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు ఎగ్ బిర్యాని వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలంటే బడీడు పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. సూపర్‌వైజర్ రాజేశ్వరీ మాట్లాడుతూ.. ఆరోగ్య పరంగా కిశోర బాలికలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అంజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సమత, ఆయా రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పేరేంట్స్ డే, అమ్మ మాట-బడిబాట అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద హాజరై మాట్లాడారు. రెండున్నర నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో జాయిన్ చేసిన తల్లులకు పువ్వులు, స్వీట్లు ఇచ్చి స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మీ, జ్యోతి ఆయాలు పద్మ, శైలజ పాల్గొన్నారు.


కాటారంలో..


చిట్యాల: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జయప్రద

పలిమెల: మండలంలోని నీలంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని అన్నారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేపించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆదిలక్ష్మి, కమల, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని రేగులగూడెం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఇంటింటా తిరిగి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లల సెల్ఫీ విత్ ఏడ బ్ల్యూసీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, ఆయా లక్ష్మి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి


కాటారం: మృతి చెందిన గేదె వద్ద రైతులు

కాటారం: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని బయ్యారంలో చోటుచేసుకుంది. బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య అనే రైతుకు చెందిన గేదె పశుగ్రాసం కోసం సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. పశుగ్రాసం మేస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభానికి సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన తీగను తాకడంతో షాక్ గురై విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం విద్యుత్‌శాఖ ద్వారా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు సమ్మయ్య కోరారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన గంట లక్ష్మీనారాయణకు చెందిన గేదె ఇప్పలబోరు సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్‌షాక్‌తో మంగళవారం అర్ధరాత్రి అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత రైతు ఎన్పీడీసీఎల్ అధికారులకు తెలిపాడు. గేదె విలువ రూ.40వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పరామర్శ

కాటారం: మేడిగడ్డ బ్యారేజ్ వద్ద నీట మునిగి మృతి చెందిన మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన రాంచరణ్, రాహుల్ కుటుంబాలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి యువకుల మృతిపై ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు. ఎంపీ వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల నిరసన


నిరసనలో పాల్గొన్న జర్నలిస్టులు

భూపాలపల్లి రూరల్: జనం సాక్షి పత్రిక ఎడిటర్ రహమాన్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కాకతీయ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లా కేంద్రంలోని జయశంకర్ సార్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు సామంతుల శ్యాం, తడుక సుధాకర్ మాట్లాడుతూ.. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలు మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఏర్పాటు చేయబోతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు పోరాటాలు చేశారని తెలిపారు. ఈ విషయంపై ప్రజల సమస్యలను జనం సాక్షి పత్రికలో ప్రచురిస్తే ఆ పత్రిక ఎడిటర్ రహమాన్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు.